వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 209

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 30 ఆగస్టు 2026







**సమయం ప్రతినిధి:** 2027 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఓటర్ల అభిప్రాయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు తమ ముఖ్యమంత్రుల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. 'వోట్ వైబ్' నిర్వహించిన సర్వేలో మూడు రాష్ట్రాల్లోని 6,000 మందికి పైగా ఓటర్లను ఆగస్టు 25 వరకు ప్రశ్నించారు. దీనితో పాటు ఇండియా-సీ ఓటర్ సర్వేలో జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది అభిప్రాయాలను సేకరించారు. పంజాబ్, ఉత్తరాఖండ్‌తో పోల్చుకుంటే ఉత్తరప్రదేశ్‌లోనే ఎమ్మెల్యేలపై అసంతృప్తి అత్యధికంగా కనిపించింది. 49 శాతం మంది తమ ప్రస్తుత ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. కేవలం 27.9 శాతం మంది మాత్రమే ఎమ్మెల్యేల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై అభిప్రాయం కొంత మెరుగ్గా ఉంది. 41.8 శాతం మంది ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయగా, 38.4 శాతం మంది అసంతృప్తి తెలిపారు. యూపీలో ప్రధాన ఎన్నికల సమస్యగా నిరుద్యోగం 23.1 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. రైతుల సమస్యలు 14.1 శాతం, విద్య-వైద్యం 13.7 శాతం, ద్రవ్యోల్బణం 12.2 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సర్వే ప్రకారం.. బీజేపీ నేతృత్వంలోని కూటమి 41.8 శాతంతో స్వల్ప ఆధిక్యంలో ఉండగా, సమాజ్‌వాదీ పార్టీ కూటమికి 38.7 శాతం మద్దతు ఉంది.




**సమయం ప్రతినిధి:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పుఝల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు. పుఝల్ సెంట్రల్ ప్రిజన్-1లోని పలు విభాగాలను సీఎం విజయ్ పరిశీలించారు. క్వారంటైన్ ప్రాంతం, సందర్శకుల హాల్, జైలు ఆసుపత్రి, డ్రగ్ డీ-అడిక్షన్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్, మహాత్మా గాంధీ కమ్యూనిటీ కాలేజీ తరగతి గదులు, లైబ్రరీ, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. హై-సెక్యూరిటీ బ్లాక్, ఉరిశిక్ష అమలు చేసే ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ఖైదీలతో సీఎం విజయ్ నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కేవలం శిక్ష విధించడం కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ ద్వారా పునరావాసానికి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. (Puzhal Jail Inmates). జైలులో పుస్తకాల లభ్యతను కూడా పెంచాలని సీఎం సూచించారు. చదువు, నైపుణ్య శిక్షణ, ఖైదీల ఆసక్తులకు అనుగుణంగా వివిధ కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. పుఝల్ జైలులోని వృత్తి శిక్షణ కేంద్రాన్ని కూడా విజయ్ పరిశీలించారు.




**సమయం ప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో సీఎన్‌జీ ధరలు మరోసారి పెరిగాయి. ఈరోజు (శనివారం) ఉదయం 6 గంటల నుంచి కిలో సీఎన్‌జీపై రూ.3.89 చొప్పున పెంచుతున్నట్లు నగర గ్యాస్ పంపిణీ సంస్థ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (IGL) ప్రకటించింది. దీంతో ఢిల్లీలో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ ధర రూ.86.98 కి చేరుకుంది. అలాగే, నోయిడాలో రూ.95.59, ఘజియాబాద్‌లో రూ.95.59, గురుగ్రామ్‌లో రూ.92.01, మీరట్‌లో రూ.95.47, ముజఫర్‌నగర్‌లో రూ.95.47, షామ్లీలో రూ.95.47కు ధరలు చేరుకున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఎల్ఎన్‌జీ ధరలు భారీగా పెరగడం తాజా ధరల పెంపునకు ప్రధాన కారణమని ఐజీఎల్ వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత సీఎన్‌జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. మే 15 నుంచి ఇప్పటివరకు నాలుగు విడతల్లో ధరలు పెరిగాయి. తాజా పెంపుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వేలాది మంది సీఎన్‌జీ వాహనదారులపై అదనపు భారం పడనుంది. సీఎన్‌జీతో నడిచే ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, ఆటోలు, వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయం పెరగనుంది. దీంతో ఈ భారం చివరికి ప్రయాణికులపై పడనుంది. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ ధరలు సంక్షోభానికి ముందు స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపయ్యాయని ఐజీఎల్ తెలిపింది. సీఎన్‌జీ సరఫరాకు అవసరమైన సహజ వాయువులో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీ ద్వారానే సమకూర్చుకుంటున్నామని పేర్కొంది.




**సమయం ప్రతినిధి:** నగరంలో ఆగస్టు 30న నిర్వహించనున్న హైదరాబాద్ రన్నర్స్ మారథాన్ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు కీలక ఆంక్షలు, మళ్లింపులు ప్రకటించారు. ఉదయం 4:30 గంటల నుంచి 9:30 గంటల వరకూ మారథాన్ జరిగే మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది. పీపుల్స్ ప్లాజా నుంచి జీఎంసీ బాలాజీ స్టేడియం, గచ్చిబౌలి వరకు నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్, సోమాజిగూడ, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, రోడ్ నంబర్ 45 మీదుగా మారథాన్ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో నెక్లెస్ రోడ్ వైపు మినిస్టర్స్ రోడ్, రాణిగంజ్ నుంచి వచ్చే వాహనాలకు అనుమతి ఉండదు. పంజాగుట్ట, రాజ్‌భవన్ వైపు వెళ్లే వాహనాలను షాదాన్--రవీంద్రభారతి మార్గంలో మళ్లించనున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వాహనాలు రోడ్ నంబర్ 10, 12--క్యాన్సర్ హాస్పిటల్ మీదుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. లిబర్టీ, కర్బాలా, ముషీరాబాద్ నుంచి ట్యాంక్‌బండ్ వైపు వచ్చే వాహనాలకు కూడా పలు ప్రాంతాల్లో మళ్లింపులు ఉంటాయి. బేగంపేట నుంచి రాజ్‌భవన్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వెళ్లే వాహనాలను గ్రీన్‌లాండ్స్ వద్ద మళ్లించనున్నారు. పంజాగుట్ట ఫ్లైఓవర్, సాగర్ సొసైటీ, ఎన్‌టీఆర్ భవన్ వద్ద కూడా ఆంక్షలు ఉంటాయని తెలిపారు. సైబరాబాద్ కేబుల్ బ్రిడ్జి నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వైపు వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. వాహనదారులు ఉదయం 4:30 నుంచి 9:00 గంటల మధ్య ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.




**సమయం ప్రతినిధి:** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన సమగ్ర పరిశీలన అవసరమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. SIR ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని కోరారు. వలస కూలీలు, రోజువారీ కూలీలు.. తమ ఓటు హక్కు వివరాలను పరిశీలించుకునేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున అదనపు సిబ్బంది అవసరమని సూచిం చారు. ఈ మూడు ప్రాంతాల్లో అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను(EROలు) నియమించాలని కోరారు. SIR ప్రక్రియను వికేంద్రీకరించాలని సీఈసీకి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని అన్నారు. ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు. కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి ఉందని.. కానీ, కాంగ్రెస్ పాలనపై సాధారణ ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు. మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన కీలక విషయాలపై స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి కొత్త వాటిని అమలు చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్గం పైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయ్యిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలన్నారు. అదేవిధంగా పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే నష్టం జరుగుతుందన్నారు. పార్టీలో లీకేజీలను కంట్రోల్ చేయాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన చెప్పుకొచ్చారు. మరోవైపు, నాలుగు పంటలకూ రైతు భరోసా అందించాలని శాసన మండలి ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏని రద్దు చేయాలని సూచించారు. ప్రజలకు ఉచిత పథకాలను తగ్గించాలని, నిజమైన లబ్ధిదారులకే వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయొద్దని, వారికి న్యాయం చేయాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

## సీజనల్ వ్యాధులను తేలికగా తీసుకోవద్దు: మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, ఆగస్టు 29, సమయం ప్రతినిధి:** సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈరోజు(శనివారం) రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై



అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణే లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

**సమయం ప్రతినిధి:** నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో విషాదం నెలకొంది. నీట్ పీజీ అభ్యర్థిని ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని అపరాజిత హాస్టల్‌లో ఉంటూ నీట్ పీజీకి ప్రిపేర్ అవుతున్న యువతి విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది. రేపే(ఆదివారం) నీట్ పీజీ పరీక్ష అనగా.. మనస్తాపంతో కర్నూలుకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని యశ్విత ప్రాణాలు తీసుకుంది. గత ఆరు నెలలుగా యువతి హైదరాబాద్‌లో ఉంటూ 'నీట్ పీజీ' పరీక్షకు ప్రిపేర్ అవుతోంది. మృతురాలు కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తె. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థిని మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఒక్కగానొక్క కూతురు మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరీక్షల మానసిక ఒత్తిడే యువతి ఆత్మహత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.



# సంపాదకీయం

## ‘తెలుగు తక్కువ’ తరానికి దారేది?

ఏడాదికి రెండుసార్లు.. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ఆర్నెల్లకోసారి మనకు తెలుగు భాష గుర్తొస్తుంది. ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం, ఇంకో ఆర్నెల్లకు ఆగస్టు 29న తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా భాష గురించి మాట్లాడుకుంటాం. తెలంగాణ ఏర్పడిన తరువాత సెప్టెంబర్ 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా పాటిస్తున్నారు. ఏమైనా, భాష గురించి ఈ రోజుల్లో చర్చించుకోవటానికైనా ఈ ‘దినోత్సవాలు’ పనికొస్తున్నాయి. తెలుగు భాషకు ఇంగ్లీష్ వల్ల పెనుప్రమాదం వచ్చిందని ఈ సందర్భంగా ఉపన్యాసాలు ఇవ్వటం, అందులో మీడియా భాష మీద నాలుగు రాళ్ళేసి వెళ్ళటం క్రమం తప్పకుండా జరుగుతోంది. వాడుక భాషలో ఇంగ్లీష్ మాటలు ఎక్కువగా వస్తున్నాయనే విమర్శ ఉన్నమాట నిజం. ఇంగ్లీష్ మీడియం చదువులు ఒకవైపు, మీడియాలో అనవసరపు ఇంగ్లీష్ మాటల వాడకం ఇంకోవైపు ఈ పరిస్థితిని మరింత దిగజారుస్తూ వస్తున్నాయి. అయితే, సంస్కృతం వాడకం సంగతేంటి? ‘జనని సంస్కృతంబు ఎల్ల భాషలకు’ అనే మాట నిజమే అయినా, ఇంకా ఎంత కాలం అదే సంస్కృతంతో తెలుగుకి దూరమవుదాం? ‘వాడుక భాష’ అనకుండా ‘వ్యావహారిక భాష’ అనటంలోనే మనకున్న సంస్కృత ప్రేమ అర్థమవుతోంది. ఏదైనా ఒక ఇంగ్లీష్ మాట వస్తే దాన్ని తెలుగులో చెప్పాలనుకున్నప్పుడు మనం సంస్కృతాన్ని ఆశ్రయిస్తున్నాం.మీడియాలో ఇప్పటికీ అదే జరుగుతోంది. మొబైల్ ఫోన్‌ను చరవాణి అని, ఇంటర్నెట్‌ను అంతర్జాలం అని రాస్తున్నాయి. కేవలం ఇంగ్లీష్ వాడకూడదనే అభిప్రాయంతోనే ఇలాంటి అనువాదాలకు దిగుతున్నట్టు ఉంది తప్ప సామాన్యులకు అర్థం కావాలన్న అభిప్రాయం ఉన్నట్టు కనబడడం లేదు. పైగా, ఎక్కువమంది మెచ్చి ఆహ్వానించి వాడటం మొదలుపెట్టినప్పుడే ఇలాంటి మాటలకు సార్వజనీనత వస్తుంది. ఔటర్ రింగ్ రోడ్‌ను బాహ్య వలయ రహదారి అని అనువదించటం వల్ల ఒరిగేదేమీలేదు. ఇంకా వీలైతే ‘చుట్టుదారి’ లాంటి మాట అయితే జనం అర్థం చేసుకుంటారు. సామాన్య జనం ‘ఇళ్ళు కడతారు’. మీడియా వాళ్ళు మాత్రం ‘గృహాలు నిర్మిస్తారు’. జనం కొత్త బట్టలు వేసుకుంటారు. కానీ మీడియా రాతల్లో మాత్రం ‘నూతన వస్త్రాలు ధరిస్తారు’. అసలు ఏ మాత్రమూ ఆలోచించకుండానే మీడియాలో చాలా సందర్భాలలో ‘నూతన’ అని వాడుతున్నారు తప్ప జనం మాటల్లో వాడే ‘కొత్త’ జోలికి పోవటం లేదు. ‘అనంతరం’ బాగుంటుంది గాని తరువాత నచ్చదెందుకో? జనం ‘ఒప్పుకుంటారు’ గాని మీడియా వాళ్ళు మాత్రం ‘అంగీకరిస్తారు’. ‘పుట్టారు’ బదులు ‘జన్మించారు’ అంటారు. ‘వాడకం’ బదులు వినియోగం అంటేనే తృప్తిగా ఉంటోంది. ‘కోప్పడ్డారు’ బదులు ‘ఆగ్రహించారు’ అని వాడాల్సిన అవసరం ఏమొచ్చింది? గెలిచారు అనటానికి బదులు విజయం సాధించారు అని, అమ్మకం బదులు విక్రయం అని, ఓడినవాళ్లను పరాజితులు అని, ‘మెచ్చుకున్నారు’ బదులు ‘అభినందించారు’ అని, ఎగతాళి బదులు అపహాస్యం అని, పుకార్లు బదులు వదంతులు అని రాయటం, చెప్పటం నిజం కాదా? మనం రాసేటప్పుడు ఆ మాట సామాన్య జనం వాడుతున్నదా, కాదా అనేది ఒక్క క్షణమైనా ఆలోచిస్తున్నామా? తరచూ తెలుగుభాష గురించి ఆవేదన వెళ్లగక్కే ఒక ఆచార్యులవారు ఈ మధ్యనే తన అనుభవాన్ని పంచుకున్నారు. చాలా పెద్ద చికిత్సాలయానికి వెళ్ళి ‘దంతవైద్యునితో కలిసేది ఉంది’ అని అక్కడున్న మహిళతో అంటే ఆమె ఏగాదిగా చూసిందట. ‘డెంటిస్ట్ అపాయింట్‌మెంట్ ఉంది’ అన్నప్పుడు ఆమెకు అర్థమైందట. ఈ పరిస్థితికి తెలుగు వాళ్ళందరినీ సిగ్గుపడవలసిందిగా కోరతున్నారాయన. దంత వైద్యుడనే సంస్కృతం జోలికి పోకుండా, దుష్టసమాసమంటూ చాదస్తానికి పోకుండా ‘పళ్ల డాక్టర్’ అని అడిగి ఉంటే సరిపోయేది. జనం నోళ్లలో నానే ‘బడి’ని ‘పాఠశాల’ చేసి అదే రుద్దాలని చూడటం వల్ల చివరికి ‘స్కూలు’ స్థిరపడిపోయింది. ‘పై చదువులకు’ అని జనం మాట్లాడుకుంటూ ఉంటే మీడియా మాత్రం ‘ఉన్నత విద్యాభ్యాసం కోసం’ నుంచి దిగిరాలేదు. ఈలోగా ‘హయ్యర్ స్టడీస్’ అని మాట్లాడే తరం వచ్చేసింది. అతిగా ఇంగ్లీష్ వాడవద్దని చెప్పాలి తప్ప చీటికి మాటికి సంస్కృతాన్ని ఆశ్రయించటం తగ్గించుకోమని ఎవరైనా చెప్పినా సంస్కృత ప్రేమికులకు కోపమొస్తుంది. వందల ఏళ్లనాటి పరాయిభాష కంటే వేల ఏళ్ల నాటి మన సంస్కృతం మెరుగు అనేది వీళ్ళ సమాధానం. ఒకప్పటి గ్రాంథికం నుంచి ఇప్పుడున్న స్థాయికి రావటానికి అవిశ్రాంత పోరాటం జరిపి, వ్యావహారిక భాషోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళినవాడు గిడుగు రామమూర్తి. కొంతమంది పండితులు ఆయన వాదనతో ఏకీభవించి సరళ గ్రాంథికంలో రచనలు మొదలుపెట్టారు. ఆ తరువాత పత్రికలు కూడా అదే బాట పట్టాయి. తాపీ ధర్మారావు లాంటివాళ్లు చొరవతీసుకున్నారు. శిష్టవ్యావహారికంలో రాయటం మొదలుపెట్టారు. ‘వారు పరమపదంబు జెందె’ నుంచి ‘వారు పరమపదించారు’ దాకా తీసుకురాగలిగారు. ఆ తరువాత తరాల్లో మరింత సరళమై ‘వారు చనిపోయారు’ దాకా రావటం చూస్తున్నాం. గిడుగు తరువాత కూడా వ్యావహారిక భాష మీద మరింత ఆలోచన జరిగింది. 1970లలో కూడా యూనివర్సిటీల పాఠ్యగ్రంథాలు గ్రాంథికంలోనే ఉండటం మీద చర్చ మొదలైంది. ప్రభుత్వ కార్యకలాపాలు, యూనివర్సిటీ పరీక్షలు, పరిశోధనాపత్రాలు శిష్టవ్యావహారికంలో అనుమతించాలంటూ 1971లో ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన తీర్మానం ఒక చరిత్రాత్మక ఘట్టం. దీనిమీద 11 మందితో ఏర్పాటైన కమిటీ ఐదు సమావేశాలు జరిపింది. ఆంధ్ర, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల పరిధిలోని ఎనిమిది మంది, ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని ఏడుగురు సాహిత్య, పాత్రికేయ ప్రముఖుల అభిప్రాయాలు సేకరించారు. ఆ విధంగా రూపొందించి ఇచ్చిన నివేదిక ఆధారంగా శిష్టవ్యావహారానికి ఆమోద ముద్ర పడి యాభై ఏళ్ళు గడిచాయి. ఈ యాభై ఏళ్ళలో భాష వాడకంలో చాలా మార్పులొచ్చాయి. రచనల్లో, విద్యారంగంలో, మీడియాలో వచ్చిన మార్పులు చాలా ఉన్నాయి. అయితే, ఈ మార్పులు ఏ దిశగా వెళుతున్నాయన్నదే భాషా ప్రేమికుల ఆందోళన. తప్పులు ఎంచుకుంటూ బాధపడటం కంటే, ప్రవాహశీలమైన భాషను క్రమబద్ధం చేసి దిశానిర్దేశం చేయాలన్న ఆలోచన కూడా కొంతమంది మాటల్లో బైటపడుతోంది. ఇది వ్యక్తులతో వీలయ్యే పనికాదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు ఆకాడెమీలు, తెలుగు విశ్వవిద్యాలయాలు, అధికార భాషా సంఘాలు, మీడియా అకాడెమీలు ఉన్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఈ సంస్థల సారథ్యంలో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తెలుగు భాష వాడకం తీరుతెన్నులను సమీక్షించి ఇప్పటి ‘తెలుగు తక్కువ’ తరానికి మార్గదర్శనం చేసేలా సూచనలివ్వాలి. కృత్రిమ మేధస్సు (AI), యంత్ర అనువాదం, వాయిస్ అసిస్టెంట్లు, పాడ్‌కాస్ట్‌లు, ఓటీటీ వేదికలు, సోషల్ మీడియా, డిజిటల్ వార్తా వ్యవస్థల విస్తరణతో తెలుగు భాష వాడకం ఇంతకుముందెన్నడూ లేనంతగా పెరిగింది. అందువల్ల భవిష్యత్తులో చాలా మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. తెలుగు వాయిస్ సెర్చ్ వినియోగం పెరుగుతుంది. ఎఐ ఆధారిత వార్తా రచన అభివృద్ధి చెందుతుంది. డిజిటల్ నిఘంటువులు మరింతగా అందుబాటులోకి వస్తాయి. యూనికోడ్ వినియోగం వల్ల తెలుగు లిపి మరింత విస్తరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు కంటెంట్ వాడకం పెరుగుతుంది. మీడియాలో తెలుగు సాంకేతిక పదసంపద అభివృద్ధి చెందుతుంది. వాడుక భాషను వేగంగా జనంలోకి తీసుకువెళ్లటంలో సోషల్ మీడియా పాత్ర చెప్పుకోదగినంతగా ఉంది. అయితే, భాషా ప్రమాణాల మీద ప్రతికూల ప్రభావం కూడా చూపుతోంది. అందుకే అవసరమైనంత మేరకే ఇంగ్లీష్, సంస్కృతం వాడేట్టు చూడటం ద్వారా తెలుగును కాపాడుకోవాలి. ఆధునిక తెలుగు వాడకం కోసం ఒక శైలీపత్రం తయారు చేయాలి. విశ్వవిద్యాలయాల స్థాయిలో శిష్టవ్యావహారానికి ఆమోద ముద్రపడి యాభై ఏళ్ళు పూర్తయిన సందర్భంలోనైనా తెలుగుభాషా దినోత్సవం ఒక రోజుకే పరిమితం కాకూడదని, భాషను కాపాడుకోవటం గురించి పాలకులు సానుకూలంగా దృష్టిపెట్టాలని కోరుకుందాం.

# ఘనంగా ప్రపంచ జానపద వేడుకలు

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 29: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి పది జిల్లాలలో నిర్వహిస్తున్న జానపద సంబరాలలో భాగంగా తేదీ 29-8-2026 నాడు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా తరుపున నాగర్ కర్నూల్ జిల్లాలోని లహరి గార్డెన్ లో ప్రపంచ జానపద దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మహిళా డప్పులు యక్షగానం ఒగ్గుడోలు వీధి భాగవతం భజన కోలాటం చిరుతల భజన వివిధ కళారూపాలకు చెందిన దాదాపు 600 పైచిలుకు కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు ఈ కార్యక్రమానికి యువకుల వాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ గారు తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్ గారు రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వందేకోటి కవిత సునీత లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ యొక్క జానపద దినోత్సవాన్ని గత 12 సంవత్సరాలుగా ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నామని ఈ సంవత్సరం కూడా అవకాశం కల్పించినటువంటి తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మాత్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారికి సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారికి అలాగే తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీ రమణాచారి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ



గౌడ్ ప్రధాన కార్యదర్శి రాము కార్య నిర్వాహక అధ్యక్షుడు చెన్నకేశవ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి ప్రధాన కార్యదర్శి రోజా మరియు జిల్లా కమిటీ సభ్యులు డివిజన్ కమిటీ సభ్యులు మండల కమిటీ సభ్యులు గ్రామ కమిటీ సభ్యులు వివిధ కళారూపాలకు చెందినటువంటి కళాకారులు పాల్గొన్నారు.

# మక్తల్ అభివృద్ధికి ‘శ్రీహరి మార్క్’ సమీక్ష

## ప్రతి గ్రామానికి 30 నిమిషాల సమయం .. సమస్యలపై లోతైన చర్చ



SIRతో పాటు గ్రామాల వారీగా అభివృద్ధి ప్రణాళికపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక దృష్టి

మక్తల్ : మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యత కల్పిస్తూ మంత్రి వాకిటి శ్రీహరి ముందుకు సాగుతున్నారు. ఈ రోజు మక్తల్ లోని క్యాంపు కార్యాలయంలో మాగనూర్ మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించి, గ్రామాల వారీగా అభివృద్ధి పనులపై విస్తృతంగా సమీక్షించారు. ప్రతి గ్రామానికి 30 నిమిషాల సమయం కేటాయించి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో మంత్రి నేరుగా చర్చించారు. ముఖ్యంగా SIR అంశంపై గ్రామాల వారీగా వివరాలు తెలుసుకుని, అవసరమైన చర్యలపై చర్చించారు.గ్రామాలోని సమస్యలపై మంత్రి నేరుగా ఆరా తీశారు.గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర అభివృద్ధి అవసరాలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామానికి ఏ పని అత్యవసరమో గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేలా సమీక్ష నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరేలా చూడాలని మంత్రి శ్రీహరి నాయకులకు సూచించారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఒక్కో గ్రామానికి ప్రత్యేక సమయం కేటాయించి సమస్యలను స్వయంగా తెలుసుకోవడం ద్వారా మంత్రి శ్రీహరి గ్రామాభివృద్ధిపై తనకున్న ప్రత్యేక దృష్టిని చాటుకున్నారు. గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాగనూర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్య ఆసియాపై భారత్ ఫోకస్.. మోదీ కీలక పర్యటన

మొదటి పేజీ తరువాయి

మధ్య ఆసియాలో భారత్ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల పర్యటనకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లలో ఆయన పర్యటించనున్నారు. తొలుత తాష్కెంట్ చేరుకోనున్న మోదీ.. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్‌తో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనున్నారు. అనంతరం బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ)26వ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించడమిది నాలుగోసారి. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగనున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలపై ఇరుదేశాల నేతలు సమీక్షించనున్నారు. భారత్ ‘వికసిత్ భారత్ 2047’, ఉజ్బెకిస్థాన్ ‘ఉజ్బెకిస్థాన్-2030’ అభివృద్ధి లక్ష్యాల మధ్య సహకారానికి ఉన్న అవకాశాలపైనా చర్చించనున్నారు. కాగా.. మధ్య ఆసియాలో భారత్‌కు ఉజ్బెకిస్థాన్ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. వాణిజ్యం, ఇంధనం, ఆరోగ్యం, ఔషధాలు, వ్యవసాయం, రసాయనాలు, యంత్ర పరికరాలు తదితర రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆ దేశ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి స్మారకాన్ని, మహాత్మా గాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు. ఆ తర్వాత కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న జరిగే ఎస్‌సీఓ సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. భద్రత, అనుసంధానం, అవకాశాలు అనే మూడు అంశాలను భారత్ కీలకంగా ప్రస్తావించనున్నారు. ఈ ఏడాది 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంటున్న ఎస్‌-సీఓలో.. భారత్ 2017 నుంచి పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఈ సదస్సు సందర్భంగా పలు దేశాధ్యక్షులతో ద్వైపాక్షిక భేటీలూ జరిగే అవకాశముంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ సమావేశం కూడా ఖరారైనట్లు సమాచారం.

# పూరిగుడిసె నుంచి పార్లమెంటు దాకా..

సమయం ప్రతినిధి : అప్పికట్ల జోసెఫ్ ప్రజాజీవితాన్ని పరిశీలిస్తే ఒక విశిష్ట లక్షణం స్ఫురిస్తుంది. స్వాతంత్ర్య సమరయోధుడిగా పోరాడి, తొలి పార్లమెంటేరియన్‌గా దేశానికి సేవ చేసి, శాసనమండలి సభ్యుడిగా ప్రజల సమస్యలను వినిపించినప్పటికీ, ఆయన అధికారాన్ని ఎప్పుడూ వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోలేదు. ఆయన జీవితంలో వెంటనే హృదయాన్ని తాకే విషయం ఆయన నిరాడంబర జీవనం. స్వాతంత్ర్య సమరయోధుడిగా, పార్లమెంటేరియన్‌గా, శాసనమండలి సభ్యుడిగా ఉన్నత పదవులు చేపట్టినప్పటికీ, ఆయన వ్యక్తిగత జీవితం మాత్రం అత్యంత సాధారణంగా ఉండేది. విజయవాడ కొండపైన పూరి గుడిసెలో నివసించేవారు. వర్షాకాలంలో చినుకులు లోపలికి వచ్చేంత మామూలు గుడిసె అది. అధికారం ఉన్నప్పుడు ఇళ్లు, భూములు, ఆస్తులు కూడబెట్టుకోవడానికి ప్రయత్నించకుండా, సామాన్య ప్రజల జీవన పరిస్థితులకు దగ్గరగా ఉండటమే ఆయనకు సహజమైన జీవన విధానం.



జవహర్‌లాల్ నెహ్రూ విజయవాడలో ఒక భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సమయంలో అప్పికట్ల జోసెఫ్ సభా ప్రాంగణానికి వచ్చారు. భద్రతా కారణాలతో పోలీసులు ఆయనను వేదికపైకి రానీయలేదు. అప్పుడు జోసెఫ్ తను వచ్చినట్టు నెహ్రూజీకి చెప్పమని కోరారు. విషయం నెహ్రూజీ దృష్టికి వెళ్లగానే, నెహ్రూ వెంటనే ఆయనను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సంఘటనతో జోసెఫ్ కేవలం ప్రాంతీయ నాయకుడు కాదనీ, జాతీయ నాయకత్వంతో సన్నిహిత పరిచయం, గౌరవం పొందిన ప్రజానాయకుడనీ అర్థమవుతుంది. విజయవాడ గాంధీహిల్‌కు ‘సరిహద్దు గాంధీ’ (ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్) వచ్చిన సందర్భం కూడా జోసెఫ్‌కు ప్రజల్లో ఉన్న గుర్తింపును చూపెట్టింది. ‘సరిహద్దు గాంధీ’ని చూడటానికి వచ్చిన ప్రజలకు ఆయనను గుర్తించేందుకు మైకుల ద్వారా, ‘అప్పికట్ల జోసెఫ్ గారి కుడివైపు ఉన్న వ్యక్తే సరిహద్దు గాంధీ’ అని ప్రకటించారు. కేంద్రమంత్రి పి.శివశంకర్ గ్యాస్ - పెట్రోలియం డీలర్‌షిప్ ఇవ్వజూపితే జోసెఫ్ దానిని సున్నితంగా తిరస్కరించారు. బాబూ జగ్జీవన్‌రామ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో స్టీల్ డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించిన అవకాశం వచ్చినప్పటికీ దానినీ తిరస్కరించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ప్రభుత్వ స్థలం పొందే అవకాశం ఉన్నప్పటికీ తీసుకోలేదు. పేద కుటుంబాల పిల్లల జీవితాలను మార్చడానికి విద్యే శక్తివంతమైన సాధనమని ఆయన నమ్మారు. తండ్రి అప్పికట్ల భూషణం స్మారకార్థం విజయవాడలోని లంబాడీపేటలో అప్పికట్ల భూషణం మెమోరియల్ స్కూల్‌ను హాస్టల్ సౌకర్యంతో స్థాపించారు. పాఠశాల ప్రారంభించడం ఆయనకు కేవలం ఒక విద్యాసంస్థ నిర్మించడం కాదు. పేదపిల్లలకు చదువు, వసతి, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు అందించాలనే సామాజిక దృక్పథం. కంచికచర్ల కోటేశు ఘటన సమయంలో బాధితుడి పరిస్థితిని తెలుసుకోవడానికి జగ్జీవన్ రామ్ విజయవాడకు వచ్చినప్పుడు, జోసెఫ్ గారిని ఒక్కరినే తనతో తీసుకెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. జోసెఫ్ గాంధేయవాది. రాజకీయ జీవితంలో తీవ్ర ప్రతిఘటనలు ఎదురైనా, తనపై దాడులు జరిగిన సందర్భాల్లో కూడా, ప్రతీకారానికి పాల్పడకుండా అహింసా మార్గాన్నే అనుసరించారు. సిద్ధాంతపరంగా విభేదించవచ్చు, కానీ మనిషిపై ద్వేషం చూపకూడదనేది ఆయన గాంధేయ దృక్పథం. ప్రముఖ గాంధేయవాది వావిలాల గోపాలకృష్ణయ్యతో ఆయన స్నేహం కూడా ఆయన ఆలోచనా విధానానికి ప్రతిబింబం. నిరాడంబర జీవనం, నిజాయితీ, ప్రజాసేవ, గాంధేయ విలువలు- ఈ అంశాల్లో ఇద్దరి మధ్య సారూప్యత ఉండేది. కాకాని వెంకటరత్నం ఎన్.జి.రంగా, నీలం సంజీవరెడ్డి, కొంగర జగ్గయ్య, పిన్నమనేని కోటేశ్వరరావు, రఘురామయ్య, చెన్నారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి తదితర ప్రముఖులతో ఆయనకు పరిచయాలు, రాజకీయ అనుబంధాలు ఉన్నాయి. అప్పికట్ల జోసెఫ్ సేవలకు గుర్తింపుగా భారత తపాలాశాఖ 2021లో ఆయన పేరుతో ప్రత్యేక తపాలా కవర్‌ను విడుదల చేసింది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన నాయకుడిగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి విద్యను ఆయుధంగా మలిచిన సామాజిక సేవకుడిగా అప్పికట్ల జోసెఫ్ సంపాదించుకున్నది ఆస్తులు కాదు, చరిత్రలో స్థానం.

# కాంగ్రెస్ మూడేళ్ల పాలనంతా కుమ్ములాటలు కొట్లాటలు సర్దుబాట్లు





## -మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎద్దేవా

సమయం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి వెనక్కి వేయబడింది. కాంగ్రెస్ వారు పరిపాలన పై దృష్టి పెట్టకుండా..కుమ్ములాటలు.. కొట్లాటలు.. వాళ్ళ సర్దుబాట్లు తప్ప ప్రజల గురించి ఆలోచన చేయడం లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి వర్యులు శ్రీనివాస్ గౌడ్ ప్రసంగం చేశారు. ప్రసంగం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రాణాలకు తెగించి కెసిఆర్ నాయకత్వం లో తెలంగాణ తెచ్చుకుంటే ఇప్పుడు అన్ని రంగాల్లో వెనక్కి నెట్టి వేయబడింది. కెసిఆర్ హయాంలో వివిధ రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణను నిలిపాము. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కెసిఆర్ ఆదేశాల ప్రకారం కేటీఆర్ ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమలు ప్రకటించారని వివరించారు. ప్రతిపక్ష పార్టీగా తాము అడిగితే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందుతాయి. లేదంటే ప్రభుత్వం ఉన్న పథకాలు ఎత్తి వేసేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కర్ణాటకలో ఒక ప్రాజెక్ట్ ఎత్తు పెంచేందుకు భూముల సేకరణకు లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నారు... కెసిఆర్ తక్కువ అప్పులు తెచ్చి కొత్త ప్రాజెక్ట్ లు పూర్తి చేసే సాగు నీరు ఇవ్వడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టల పనుల్లో అక్రమాలు జరిగాయాని తప్పుడు ప్రచారం చేస్తున్నారు..NDSA రిపోర్ట్ లో అక్రమాలు జరగలేదని అధికారికంగా ప్రకటన వచ్చింది. వెలిగొండ టన్నెల్ పనులు పూర్తి అయింది.. దానితో సమానంగా ప్రారంభించిన SLBC పూర్తి కాలేదు. నికర జలాల నుంచి 11 టీఎంసీ లు వెలిగొండ ద్వారా సాగునీరు తీసుకుంటామని అంటున్నారు. కానీ దానికి మించి తీసుకుంటున్నారని ఆరోపించారు. సీనియర్ మంత్రి జూపల్లి ఉన్న.. సీఎం రేవంత్ రెడ్డి ఒక్క మాట మాట్లాడ్డాలేరు... మన నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్తుంటే ఎందుకు నోరు మెదడం లేదని ప్రశ్నించారు . పోతిరెడ్డిపాడు వద్ద మంత్రులు వెళ్లి చుడండి.. కెసిఆర్ ఉంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధైర్యం చేసేది కాదు.కాంగ్రెస్ ప్రభుత్వం ఊరికే ఉంటే తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. తెలంగాణ కు క్రాప్ హాలిడే... ఆంధ్రప్రదేశ్ లో క్రాప్ ఫెస్టివల్ చేస్తుందని గుర్తు చేశారు. జిల్లాలో ఉన్న రిసర్వాయర్లు నింపలేదు.. 60 టీఎంసీల నీరు నింపేందుకు అవకాశం ఉన్న నింపలేదు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలమూరు రైతుల మీద ప్రేమ ఉంటే వెలిగొండ ప్రాజెక్ట్ కు నికర జలల నుంచి నీళ్లు తీసుకోకుండా వరద జలల నుంచి మాత్రమే నీళ్లు తీసుకోమని చెప్పండి.నీళ్లు.. నిధులు.. నియామకాలు లేవు.. మేము కొట్లాడింది దీని కోసం.. కానీ ఇవి ఇప్పుడు తెలనగాణ ప్రజలకు అందటం లేదు. పార్టీలకు అతీతంగా సాగు నీటికోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విలేకరుల సమావేశంలో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లు ఆంజనేయులు, రహమాన్,మాజీ జడ్పీటీసీ నరేందర్, మాజీ ఎంపీపీ బాలరాజు, సింగిల్ విండో చైర్మన్‌లు రాజేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య గౌడ్, హన్వాడ మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్ సీనియర్ నాయకులూ, కార్పొరేటర్లు ఇతర నాయకులూ పాల్గొన్నారు.

## వారం రోజుల పోరాటం.... కెసిఆర్ బస్సు యాత్ర కార్యకర్తలంతా సమిష్టిగా పాల్గొనాలి మాజీ మంత్రి శ్రీనివాస్గౌడ్ పిలుపు

(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : కెసిఆర్ ఆదేశాల ప్రకారం కేటీఆర్ వారం రోజుల పోరాటం పై ప్రకటన చేసారని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. దీని తరువాత కేటీఆర్ పాదయాత్ర.. కెసిఆర్ బస్సు యాత్ర ఉంటుంది. రైతులు.. యువత.. మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. కల్యాణ లక్ష్మి.. రైతు బంధు.. రైతు భరోసా.. పెంచుతామని చెప్పిన పెన్షన్ ఇవ్వడం లేదు..బీ ఆర్ ఎస్ అధికారంలోకి వస్తే నిలిచిన ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసి సాగు నీరు అందించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తాం. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికీ రానున్న రోజుల్లో తగిన గుర్తింపు ఉంటుంది.వారం రోజుల పాటు నిర్వహించే నిరసన కార్యక్రమల్లో అందరూ సమిష్టిగా పాల్గొనాలి.



## కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి!





(సమయం ప్రతినిధి దేవరకద్ర) : భూత్పూర్ మండలం అన్నా సాగర్ గ్రామంలో దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన,420 హామీల మోసాలపై చేపట్టబోయే నిరసన కార్యక్రమాల గురించి పార్టీ శ్రేణులకు,నాయకులకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ సమన్వయంతో పనిచేసి నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలతో మమేకమైతూ,కాంగ్రెస్ పార్టీ మోసాలు,పాలన వైఫల్యాల గురించి ప్రజల్లో చర్చ జరిగే విధంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు.

**సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వారం రోజుల పాటు 'బాకీ కార్డుల'తో**
**కాంగ్రెస్ 6 గ్యారెంటీలు,**
**420 హామీల మోసాలను ఎండగట్టే విధంగా నిరసన కార్యక్రమాలు..**
**దేవరకద్ర నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలి..**
**- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపు**

## వాణిజ్య ఒప్పందంపై ఎంపీ మల్లు రవికి ఎస్కేయం విజ్ఞప్తి



హైదరాబాద్ : సంయుక్త కిసాన్ మోర్చా (SKM) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలనీ దేశంలో రాష్ట్రాలలో పార్లమెంటు, శాసనసభలలో చర్చించాలని MP, MLA లు మాట్లాడాలని FTA ను రద్దు చేయాలని వినతి పత్రాలు ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఇవ్వాలని,SKM జాతీయ కమిటీ పిలుపు నిచ్చింది. అందులో భాగంగా నాగర్ కర్నూల్ కాంగ్రెస్ MP మల్లు రవి కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది.

## అచ్చంపేట మాల వారి బోనాల పండుగలో పాల్గొన్న BJYM నాయకులు



అచ్చంపేట: పట్టణంలో మాల సమాజం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగ కార్యక్రమానికి అచ్చంపేట దీజేవీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మాల సోదర సోదరీమణులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సోదరభావంతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చందులాల్, శివచంద్ర గౌడ్, కార్తీక్ రెడ్డి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శక్తిని సృష్టించాం.. నియంత్రించగలమా?

సమయం ప్రతినిధి : అమెరికాలోని న్యూ మెక్సికో ఎడారిలో 1945 జూలై 16. 'ట్రినిటీ' పేరిట తొలి అణు పరీక్ష జరిగింది. ప్రకృతిలో దాగి ఉన్న అపారమైన శక్తిని మనిషి అర్థం చేసుకోవడమే కాకుండా దాన్ని తన చేతుల్లోకి తీసుకోగలడని నిరూపితమైన క్షణమది. అణుశక్తి మానవ నాగరికత అభివృద్ధికి కొత్త అవకాశాలను తెరిచింది. అదే సమయంలో ప్రమాదకరమైన అణ్వాయుధ పోటీకి నాంది పలికింది. 1945 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వేలాది అణు పరీక్షలు జరిగాయి. వాటి ప్రభావం పరీక్షా కేంద్రాలకే పరిమితం కాలేదు. రేడియేషన్, పర్యావరణ కాలుష్యం, మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలు... మనిషి సృష్టించిన మహాశక్తి మరో ముఖాన్ని చూపించాయి. 1991 ఆగస్టు 29న కజకిస్థాన్‌లోని సెమిపలాటిన్స్క్ అణు పరీక్షా కేంద్రాన్ని మూసివేశారు. 1949 నుంచి 1989 మధ్య అక్కడ 456 అణు పరీక్షలు జరిగాయి. వాటి ప్రభావంతో స్థానిక ప్రజలు, భూభాగం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ కేంద్రం మూసివేతను పురస్కరించుకుని 2009లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 29ని 'అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం'గా ప్రకటించింది. ఇది కేవలం గతాన్ని గుర్తుచేసుకునే రోజు కాదు. అణుశక్తి మానవత, దానవతను గుర్తుచేసుకోవడంతో పాటు.. అణు పరీక్షలు నిలిపివేసి, అణ్వాయుధ రహిత ప్రపంచం దిశగా అడుగులు వేయాల్సిన ఆవశ్యకతను గుర్తుచేసే రోజు. ఎందుకంటే శక్తిని సృష్టించడం ఒక విజయమైతే.. దాన్ని నియంత్రించగలగడం అంతకుమించిన విజయం. ప్రతి గొప్ప వైజ్ఞానిక ఆవిష్కరణ మనిషి సామర్థ్యాన్ని పెంచింది. అగ్నిని అదుపులోకి తెచ్చాం. చక్రాన్ని కనిపెట్టాం. ఆవిరి శక్తిని ఉపయోగించుకున్నాం. విద్యుత్తును వినియోగించుకున్నాం. అణుశక్తిని విప్పాం. ఇప్పుడు కృత్రిమ మేధస్సును సృష్టిస్తున్నాం. సాంకేతిక శక్తి పెరిగే కొద్దీ దాని ప్రభావం కూడా పెరుగుతోంది. వేల కిలోమీటర్ల దూరం నుంచే లక్ష్యాలను ఛేదించగలిగే క్షిపణులు, డ్రోన్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. సైబర్ దాడులు భౌతిక సరిహద్దులను దాటి కీలక వ్యవస్థలను ప్రభావితం చేయగలవు. మరి అంతటి మహాశక్తి మన చేతుల్లో ఉన్నప్పుడు నిర్ణయం తీసుకునే మనిషి ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నాడన్నదే అసలు ప్రశ్న. మరింత స్పష్టంగా చూస్తే సాంకేతికంగా ఎదిగిన ప్రతి నాగరికత.. చివరకు తానే సృష్టించిన శక్తితో ప్రమాదంలో పడుతుందా? మనిషి ఆవిష్కరణ వేగం పెరుగుతున్న కొద్దీ దానికి తగిన చట్టాలు, నైతిక ప్రమాణాలు, భద్రతా వ్యవస్థలు, అంతర్జాతీయ నియమాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాలి. లేకపోతే సాంకేతికత మనిషి చేతిలో సాధనంగా కాకుండా.. మనిషి నియంత్రించాల్సిన శక్తిగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటిదాకా మనం నాగరికత అభివృద్ధిని ప్రధానంగా శక్తితో కొలిచాం. ఇక మరో ప్రమాణాన్ని కూడా చేర్చాల్సిన సమయం వచ్చింది. మన చేతుల్లోకి వచ్చిన శక్తిని ఎంత బాధ్యతగా నియంత్రించగలుగుతున్నాం? బహుశా అదే నిజమైన నాగరికతకు కొలమానం కావచ్చు. సెమిపలాటిన్స్క్ పరీక్షా కేంద్రం మూసివేయడం, అణు పరీక్షలపై అంతర్జాతీయ వ్యతిరేకత పెరగడం, సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందం (సీటీబీటీ) వంటి ప్రయత్నాలు.. మనిషి తాను సృష్టించిన ప్రమాదానికి పరిమితులు విధించేందుకు ప్రయత్నించాడని చూపిస్తున్నాయి. సీటీబీటీ ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోయినా అణు పరీక్షలపై అంతర్జాతీయ ప్రమాణాన్ని బలోపేతం చేయడంలో అది కీలక పాత్ర పోషించింది. శక్తిని సృష్టించిన నాగరికత దానికి పరిమితులు విధించగలదనే నమ్మకం. అదే మన ఆశ. ఆగస్టు 29 కేవలం అణు పరీక్షల చరిత్రను గుర్తుచేసే రోజు కాదు. మనిషి ప్రకృతిలోని అపారమైన శక్తిని తన చేతుల్లోకి తీసుకున్న క్షణం నుంచీ ప్రతి కొత్త సాంకేతిక విప్లవం ఒకే ప్రశ్నను మరింత తీవ్రంగా మన ముందుకు తెస్తోంది: మనం సృష్టించిన శక్తి మన భవిష్యత్తును నిర్ణయిస్తుందా లేక ఆ శక్తి భవిష్యత్తును మనమే నిర్ణయించగలమా? పశ్చిమాసియాలో ఇటీవలి సంఘర్షణల చరిత్ర ఒక పాఠం చెబుతోంది. సాంకేతికంగా అనుసంధానమైన ప్రపంచంలో ఒక ప్రాంతీయ సంక్షోభం కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలదనేదే ఆ పాఠం. అణుయుగం మరో పాఠం చెబుతోంది.. శక్తి పెరిగిన కొద్దీ మానవ తప్పిదానికి చెల్లించే మూల్యం కూడా పెరుగుతుంది. అధునాతన కృత్రిమ మేధస్సు మానవాళి భవిష్యత్తు గురించి హెచ్చరిస్తోంది -- మనిషి సృష్టించే శక్తి మరింత వేగంగా పెరగవచ్చు. అందుకే రాబోయే తరాలకు మనం ఇవ్వాల్సిన గొప్ప సాంకేతిక వారసత్వం మరింత శక్తిమంతమైన యంత్రాలు మాత్రమే కాదు. శక్తిని నియంత్రించే తెలివి, బాధ్యత, నైతికత. ప్రతి అభివృద్ధి చెందిన నాగరికత ఎదుర్కొనే ఒక పరీక్ష కావచ్చు. ఆ పరీక్షలో అసలు ప్రశ్న 'మనిషి ఎంత శక్తివంతుడయ్యాడు?' కాదు. 'తన చేతుల్లోకి వచ్చిన శక్తిని తానే ఎంత బాధ్యతగా నియంత్రించగలిగాడు?' ఆ ప్రశ్నకు మనం ఇచ్చే సమాధానమే.. మానవ నాగరికతకు తదుపరి అధ్యాయం ఉంటుందా.. లేక విశ్వంలోని మరో నిశ్శబ్ద నాగరికతగా మిగిలిపోతుందా అన్నదాన్ని నిర్ణయించవచ్చు.

**Sree Visvesvaraya Institute of Technology & Science**
**(V) Chowdaerpally, (M) Devarkadra, Mahabubnagar.T.G. (Code: V ITS)**

**MBA SPOT ADMISSIONS-2026-27**

The Interested TGI-CET-2026, Qualified & Not Qualified any Degree with 49.5 for (OC) and for SC/ST/BC/ with 44.5% candidates can apply for the MBA 1 year left over vacancies on or before 03-09-2026 at college office. The spot admissions will be held on 04-09-2026 at college campus, and to bring all original certificates with requisite fee.

**Principal. 9505506207 / 9505506219**






# అభివృద్ధిలో అలసత్వం వద్దు.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

(సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్) : మండల అభివృద్ధిలో అలసత్వం వద్దు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ రూరల్ మండల కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఐఐఐటీలో సీట్లు సాధించినట్లు ఎంఈఓ సమావేశంలో వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేస్తూ, ఐఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను తదుపరి మండల స్థాయి సమీక్షా సమావేశానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వారిని ఘనంగా సన్మానించి ప్రోత్సహిస్తామని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి విజయాన్ని ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిపినట్లవుతుందని, అదే సమయంలో ఇతర గ్రామాల సర్పంచులకు కూడా విద్యార్థుల విద్యాభివృద్ధిపై అవగాహన కల్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఎలాంటి భవనాల నిర్మాణంలోనూ జాప్యం చేయవద్దని ఎమ్మెల్యే సూచించారు. భూమి లేదనే కారణంతో భవనాల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయకుండా, గ్రామ కంఠంలోని ప్రభుత్వ భూమిని అవసరమైన భవనాల నిర్మాణానికి కేటాయించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణంలో కూడా అలసత్వం వీడాలని అన్నారు. పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన టాయిలెట్లను నిర్మించడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. మండలంలో లో–వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, సేకరించిన భూమిని విద్యుత్ శాఖకు అప్పగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని, ఆయన సర్పంచులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీమతి కరుణశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర సాధనతో విజయాలు అందుకోవాలి ఎమ్మెల్యే జిఎంఆర్




దేవరకద్ర : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేవరకద్ర నియోజక వర్గ ఎమ్మెల్యే శ్రీ G మధుసూదన్ రెడ్డి (GMR) క్రీడాకారులకు, క్రీడాభిమానులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా, ఆయన స్ఫూర్తితో, ప్రతి క్రీడాకారుడు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధనతో విజయాన్ని అందుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించి తద్వారా తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సమగ్ర స్పోర్ట్స్ పాలసీ, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. అత్యుత్తమ క్రీడా మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలను కల్పిస్తున్నామని గుర్తుచేస్తూ, తెలంగాణ గౌరవాన్ని, భారత కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వేదికలపై నిలబెట్టే క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని చెప్పారు.

## ఆంజనేయ స్వామిని దర్శించుకున్న చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్



అమరచింత : అమరచింత మండల పరిధిలోని కిష్టం పల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద సప్తాంగం కార్యక్రమం సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం లో తెలంగాణ రాష్ట్ర టాడి టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు ఐజజ వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అమరచింత పట్టణ అధ్యక్షుడు టి రవికాంత్, అమరచింత మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ , అమరచింత కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి , ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హనుమంతు నాయక్,నందిమల్ల X రోడ్ సర్పంచ్ విజయభారతి రాము, ఉప సర్పంచ్ భాస్కర్ , ఈర్లదిన్నె గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి , వార్డ్ నంబర్స్ చుక్క కృష్ణ వర్ధన్ , చంద్ర గట్టు గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, నాగల్ కడుమూర్ గ్రామ అధ్యక్షుడు జగన్ రెడ్డి ,పి రామ్ రెడ్డి , ప్రభాకర్ , ఆనంద్ , రాజు, దయానంద్ ,K. కృష్ణ , B. కృష్ణ , రామ్ రెడ్డి , నల్ రెడ్డి , నరసింహ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత ఆశలపై నీళ్లు చల్లిన పాలకులు: ఏఐవైఎఫ్




వనపర్తి : యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి ఆశలపై పాలకులు నీళ్లు చల్లారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సంతోష్ అన్నారు. పానగల్ మండలం కేతేపల్లి లో ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. దేశంలో 40 శాతం యువత ఉన్నారని వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. యువత స్వయం ఉపాధి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించలేదని యువత నిరాశ నిస్పృహలో ఉన్నారన్నారు. మోదీ యువత వ్యతిరేక విధానాలపై పోరాడాలి అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. రాజీవ్ యువజన వికాస్ పథకం పేరుతో దరఖాస్తులను స్వీకరించిన ఇంతవరకు ఎంపిక చేయలేదని రుణాలను ఇవ్వలేదన్నారు. సెప్టెంబర్ 8 9 10 తేదీల్లో యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభలు జరుగుతున్నాయని యువత సమస్యలపై చర్చించి పోరాటానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సంతోష్, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు, పరశురాములు, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావడమే మా అందరి అభీష్టం ..!





### RAGA FOR RISE OF INDIA పాదయాత్రకు డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ సంఘీభావం..!

(సమయం ప్రతినిధి ఆలంపూర్) : రాహుల్ గాంధీని భారత ప్రధానమంత్రిగా చూడాలనే ఆకాంక్షతో ఒంగోలుకు చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన RAGA FOR RISE OF INDIA పాదయాత్రకు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ సంఘీభావం తెలిపారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కొనసాగుతున్న ఈ పాదయాత్ర శనివారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎర్రవల్లి భారత్ పెట్రోల్ బంక్ నుంచి బీచుపల్లి హనుమాన్ ఆలయం వరకు డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ పాదయాత్రలో పాల్గొని సుమారు 5 కిలోమీటర్లు కాటూరి వెంకటేశ్వర్లుతో కలిసి నడిచారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ. "రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే మా అందరి కోరిక. భారతదేశ పరిస్థితులు మారాలంటే, ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే రాహుల్ గాంధీ నాయకత్వం అవసరం" అని అన్నారు. భారతదేశ ప్రతిష్ట గత కొన్నేళ్లుగా దిగజారిందని, దేశం తిరిగి ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలంటే రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేస్తేనే దేశ ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందనే దృఢ సంకల్పంతో కాటూరి వెంకటేశ్వర్లు ఈ పాదయాత్రను చేపట్టారని తెలిపారు. జూన్ 19న రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ప్రారంభమైన ఈ పాదయాత్ర ఇప్పటికే కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కొనసాగి, తెలంగాణలోకి ప్రవేశించిందని సంపత్ కుమార్ తెలిపారు. గద్వాల నియోజకవర్గాన్ని పూర్తి చేసుకుని అలంపూర్ నియోజకవర్గంలోకి ప్రవేశించిన సందర్భంగా ఎర్రవల్లి శివారులో కాటూరి వెంకటేశ్వర్లుకు స్వాగతం పలికినట్లు చెప్పారు. "కాటూరి వెంకటేశ్వర్ల సంకల్పమే కాదు.. ఒక ఏఐసీసీ కార్యదర్శిగా, మాజీ శాసనసభ్యుడిగా నా సంకల్పం కూడా అదే. రాహుల్ గాంధీ నాయకత్వంపై నాకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉంది. ఆయన ప్రధానమంత్రి కావాలని అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారు" అని డాక్టర్ సంపత్ కుమార్ అన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగుతున్న ఈ పాదయాత్ర యువత, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల ఆకాంక్షలకు ప్రతీకగా విజయవంతంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. కాటూరి వెంకటేశ్వర్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, తెలంగాణ రాష్ట్రం దాటే వరకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. పాదయాత్ర విజయవంతంగా పూర్తయ్యేలా కాటూరి వెంకటేశ్వర్లుకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు డాక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, అన్ని మండలాల మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, అధికార ప్రతినిధులు, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్‌లో మంచినీటి పైప్‌లైన్ లీకేజీలు - అధికారుల నిర్లక్ష్యం ఎప్పటివరకు?



మక్తల్ :నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పట్టణంలోని బస్టాండ్ ముందు, హనుమాన్ గుడి దగ్గర, స్వాగత్ కాంప్లెక్స్ ముందు, మెడికల్ షాప్ సమీపంలో మంచినీటి పైప్‌లైన్ పగిలి గత 15 రోజుల నుంచి నెల రోజులుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా హైదరాబాద్ రోడ్డులో ఎంఆర్ఎఫ్ టైర్స్ షోరూమ్ ఎదురుగా, రాము సార్ హాస్పిటల్ పక్కన మరో పైప్‌లైన్ పగిలి సుమారు రెండు నెలలుగా నీరు వృథాగా పోతున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికే పరువు కాలనీలో తాగునీరు సక్రమంగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు ఉంటే, మరోవైపు మంచినీరు ఇలా రోడ్లపై వృథాగా పోతుండటం ఎంతవరకు సమంజసం అధికారులు దీనిపై తక్షణమే దృష్టి పెట్టాలి. ప్రజలు పడుతున్న ఇబ్బందులు సంబంధిత అధికారులకు పట్టడం లేదా అధికారులు ఉన్నది ప్రజలకు ఇబ్బంది లేకుండా సరైన పనులు చేయడానికే కదా. ప్రజలు సమస్యను చెప్పే వరకు పనులు చేయాలంటే, అధికారుల పనితీరులో ఎంత నిర్లక్ష్యం ఉందో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలకు అందాల్సిన విలువైన మంచినీరు రోజూ రోడ్లపై వృథాగా పోతుంటే అధికారులు చూస్తూ ఉండటం బాధ్యతారాహిత్యం కాదా సమస్య కనిపించిన వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. మిషన్ భగీరథ అండర్‌టేకింగ్ అయినా, మున్సిపల్ అధికారులు అయినా – ఏ శాఖకు సంబంధించిన సమస్య అయినా ప్రజలకు సంబంధించిన సమస్యను ఒకరిపై ఒకరు నెట్టకుండా వెంటనే పరిష్కరించాలి. ఈ రెండు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతులు చేసి, మంచినీటి వృథాను అరికట్టి, తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కాలనీలకు సక్రమంగా నీటి సరఫరా చేయాలని బ్యాటరీ రాజు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు చెప్పిన తర్వాతే కాదు... ప్రజలకు సమస్య రాకముందే అధికారులు స్పందించేలా పనితీరు ఉండాలి.

# పారదర్శకంగా నోటీసుల జారీ ప్రక్రియ నిర్వహించాలి






**సంబంధిత వ్యక్తులకు మాత్రమే నోటీసులు అందజేసి రసీదులు తీసుకోవాలి**
**ఇప్పటివరకు 75 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తి**
**కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 28 :** ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సంబంధిత వ్యక్తులకు మాత్రమే నోటీసులు అందజేసి, వారు నోటీసు స్వీకరించినట్లు తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన, నోటీసుల జారీ, హియరింగ్ నిర్వహణ తదితర అంశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి వివరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ...బీఎల్ఓలు నోటీసులను సంబంధిత వ్యక్తులకు మాత్రమే అందజేసేలా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నోటీసులు అందజేసిన అనంతరం సంబంధిత వ్యక్తి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవడంతో పాటు, ప్రక్రియకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. నోటీసుల జారీ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నోటీసులు అందజేసిన తర్వాత హియరింగ్ ప్రక్రియను కూడా ముందస్తు ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. హియరింగ్‌కు రెండు రోజుల ముందే సంబంధిత ఓటర్లకు మరోసారి సమాచారం అందించి, హియరింగ్ తేదీ, సమయం గురించి గుర్తు చేయాలని సూచించారు. దీంతో ఓటర్లు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ఓటర్లు హియరింగ్ సమయంలో సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాల విషయంలో కూడా వారికి ముందుగానే స్పష్టత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒక ధ్రువీకరణ పత్రం మరియు ఆధార్ ను సమర్పిస్తే సరిపోతుందనే విషయాన్ని ఓటర్లకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. దీనివల్ల పత్రాల సమర్పణపై ఓటర్లలో అనవసరమైన గందరగోళం లేకుండా చూడవచ్చని తెలిపారు. నోటీసు కు సంబంధించి ఏ ధ్రువీకరణ పత్రం అవసరం అవుతుందో ఓటరుకు ముందుగానే తెలియజేయడని తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏఈఆర్ఓలకు హియరింగ్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. హియరింగ్ సమయంలో పాటించాల్సిన విధివిధానాలు, పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై వారికి పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనామలీస్, నో మ్యాపింగ్‌కు సంబంధించిన వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడా నిబంధనల మేరకు పంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, సంబంధిత సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసినప్పటికీ కొంతమంది ఓటర్లు నో మ్యాపింగ్‌లో ఉన్నట్లు గుర్తించిన సందర్భాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అన్నారు. ఒక చిరునామాలో నివసిస్తున్న వ్యక్తులను మరో చిరునామాలో చూపించడం, ఒక చిరునామాలో నివసించని వ్యక్తులను అదే చిరునామాలో ఉన్నట్లు నమోదు చేయడం వంటి అంశాలు వెలుగులోకి వస్తే సమగ్రంగా విచారణ చేపట్టాలని సూచించారు. ఇలాంటి తప్పిదాలు సంబంధిత బీఎల్ఓల నిర్లక్ష్యం లేదా తప్పిదం వల్ల జరిగినట్లు నిర్ధారణ అయితే, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నోటీసులు అందజేసిన తర్వాత సంబంధిత వ్యక్తులకు తమ వివరణను తెలియజేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేందుకు ఏడు రోజుల సమయం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో ఓటర్ల జాబితాలోని తప్పిదాలను నిబంధనల ప్రకారం సరిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నోటీసుల జారీ నుంచి హియరింగ్ వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## 92వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఈనెల 30 నుండి ఆయుధ చండి అతి రుద్ర యాగం

-వనపర్తి జిల్లా కేంద్రంలోని హిందూ బంధువులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి.
-శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి.

వనపర్తి, సమయం ప్రతినిధి : వనపర్తి జిల్లాలో ఈనెల 30 నుండి అక్టోబర్ 13 వరకు పెబ్బేరు రోడ్డులోని పాల కేంద్రము ప్రక్కన పక్కన శ్రీకృష్ణ కాలచక్రం ఆధ్వర్యంలో 92వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఏర్పాట్లను పరిశీలించారు. కంసచాణూరమర్ధనమ్ దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ విష్ణుపంచాయతనం అయుత చండి " అతిరుద్రం,శ్రీసీతారామ సామ్రాజ్య పట్టాభిషేకశీ చతుర్వేద పూర్వక మహాగణపతి, మహాసార, సుదర్శన, లక్ష్మీ నారాయణ సహిత శ్రీమద్భాగవత 92 వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవము శ్రీ కృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి ఆధ్వర్యంలో జరుగుచున్నది కావున ఈ కార్యక్రమం మహోత్సవానికి హిందూ బంధువులు అందరూ వచ్చి పాల్గొని తరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం స్థలం వనపర్తి జిల్లా కేంద్రం మర్రి కుంట పాలకేంద్రం పక్కన ఈ కార్యక్రమంలో పాల్గొనాలని జర్నలిస్ట్ కానమోని ఆంజనేయులు కీ కార్యనిర్వాహకులైన పీఠాధిపతి స్వామీజీ ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగిందన్నారు.

## ఎలివేటెడ్ కారిడార్‌కు భూములిచ్చిన వారికి భారీ పరిహారం

**63 మంది భూయజమానులకు రూ.96.5 కోట్ల చెక్కులు అందజేసిన కలెక్టర్ మను చౌదరి**



వేకువ సమయం ఆగస్టు 29 కీసర ప్రతినిధి : సికింద్రాబాద్-శామీర్‌పేట్ మధ్య ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూములు ఇచ్చిన అల్వాల్ మండల భూయజమానులకు రెండో విడత పరిహారం చెక్కులను జిల్లా కలెక్టర్ మను చౌదరి శనివారం అందజేశారు. కలెక్టర్ ఛాంబర్‌లో డీఆర్వో మాలతితో కలిసి 63 మంది భూయజమానులకు మొత్తం 7,222 చదరపు గజాల భూమికి గాను రూ.96.5 కోట్ల పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధికి భూయజమానులు సహకరిస్తున్నందుకు అధికారులు అభినందించారు. ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం ఆదా కానుందని తెలిపారు.

## కీసరలో ఓటర్ల సవరణకు శ్రీకారం

**నోటీసులు అందుకున్న ఓటర్లు పత్రాలతో హాజరు.. వివరాలు సరిచూసుకోవాలని తహసీల్దార్ సూచన.**



వేకువ సమయం ఆగస్టు 29 కీసర ప్రతినిధి : కీసర మండల తహసీల్దార్ కార్యాలయంలో కీసర పీఎస్-190 బూత్‌కు సంబంధించిన ఓటర్ల సవరణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. తహసీల్దార్ యాదగిరి రెడ్డి సమక్షంలో అధికారులు ఓటర్ల వివరాల సవరణ ప్రక్రియను చేపట్టారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాల్లో మార్పులు, సవరణల కోసం గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లతో కార్యాలయానికి హాజరవుతున్నారు. సమర్పించిన పత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం వివరాలను సవరించే ప్రక్రియ కొనసాగుతోంది. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే కార్యాలయానికి హాజరై తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని తహసీల్దార్ యాదగిరి రెడ్డి సూచించారు. ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు నోటీసుతో పాటు అవసరమైన గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రైళ్లలో మత్తుమందు కలిపిన నీటితో చోరీలు.. ఇద్దరు నిందితుల అరెస్ట్

సమయం ప్రతినిధి : నగరంలో రైలు ప్రయాణికులను టార్గెట్ చేసి మత్తుమందు కలిపిన నీటిని ఇచ్చి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బత్త ప్రసాద్‌రెడ్డి (39), కొరపాటి నర్సింహారావు (44)లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి ఒప్పో సెల్‌ఫోన్, 10 మత్తు మాత్రలు, రూ.35,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 17న శబరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న అనిల్‌కుమార్‌తో నిందితులు మాటలు కలిపి.. మత్తుమందు కలిపిన నీటిని ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు మత్తులోకి వెళ్లిన అనంతరం అతడి లగేజీ బ్యాగ్‌ను అపహరించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ జీఆర్పీ ప్రత్యేక బృందాలు వారిని పట్టుకున్నాయి.

## శ్రీశనేశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు పరమశివునికి రుద్రాభిషేకాలు





నాగర్ కర్నూల్, సమయం ప్రతినిధి ఆగస్ట్ 29: శ్రీ పరాభవ నామ సంవత్సరం శ్రావణ మాసం క్రిష్ణ పక్షం పాడ్యమి శనివారం పూర్వ భద్ర, ఉత్తర భద్ర నక్షత్రము నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకలు భక్తితో వేదమంత్రచరణల మధ్య భక్తి శ్రద్ధలతో జరిగాయి.శ్రీసార్ధాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు.ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు.అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ ఆర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.

## హోలీ మేరీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే-2026

**445 మంది విద్యార్థులకు పట్టాలు.. కళాశాల టాపర్‌కు గోల్డ్ మెడల్.. రూ.19 లక్షల అత్యధిక ప్లేస్‌మెంట్ ప్యాకేజీ**




వేకువ సమయం ఆగస్టు 29 కీసర ప్రతినిధి : కీసర మండలం: బోగారంలో హోలీ మేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ డే-2026 వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ (రిటైర్డ్) ముఖ్య అతిథిగా, సెంచూరియన్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.ఎం. రావు అతిథిగా హాజరయ్యారు. 2025-26 విద్యా సంవత్సరంలో 621 మంది విద్యార్థుల్లో 445 మంది కోర్సులను విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. వీరిలో 91 మంది ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్, 297 మంది ఫస్ట్ క్లాస్, 57 మంది సెకండ్ క్లాస్ సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందజేశారు. CSE-DS విభాగానికి చెందిన అనెమోని అఖిల 9.17 జఒుూాతో కళాశాల టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. సంస్థ 74 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు GATE, CAT, GREలో 100 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ ఏడాది రూ.19 లక్షల అత్యధిక జుజ ప్యాకేజీతో పాటు సుమారు 50 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు పొందారని తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తూ ఈ ఏడాది 30 పేటెంట్లు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని శివధర్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్లు వృత్తి జీవితంలో నైతిక విలువలు, వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతలను పాటిస్తామని గ్రాడ్యుయేషన్ ఓత్ స్వీకరించారు.

## ఎమ్మెల్సీ మిర్జా రహ్మాత్ బేగ్‌కు అధిష్టానం బిగ్ షాక్.. పార్టీ నుంచి బహిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు 29: నగరంలోని ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మాత్ బేగ్‌కు పార్టీ అధిష్టానం షాక్ ఇచ్చింది. ఆయనను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఎంఐఎం కీలక నిర్ణయం తీసుకుంది. తక్షణమే పార్టీని వీడాలని ఆదేశించిన అధిష్టానం.. ఎమ్మెల్సీ పదవికి కూడా వెంటనే రాజీనామా చేయాలని సూచించింది. తన రాజీనామా లేఖను మండలి చైర్మన్‌కు పంపాలని స్పష్టం చేసింది. ఓ మహిళ ఇంట్లోకి మారువేషంలో వెళ్లిన వ్యవహారానికి సంబంధించి రహ్మాత్ బేగ్‌పై పార్టీ అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై వివరణలు, పరిణామాలను పరిశీలించిన అనంతరం పార్టీ క్రమశిక్షణ చర్యలకు దిగినట్లు సమాచారం. ఇక పార్టీ ఆదేశాలపై మిర్జా రహ్మాత్ బేగ్ స్పందించారు. తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. పార్టీ నుంచి బహిష్కరించినప్పటికీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పినట్లు సమాచారం. మరోవైపు పార్టీ అధిష్టానం మాత్రం పదవికి రాజీనామా చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో రహ్మాత్ బేగ్ వ్యవహారం ఎంఐఎంలో మరింత చర్చనీయాంశంగా మారింది. పార్టీ నిర్ణయం, ఎమ్మెల్సీగా రహ్మాత్ బేగ్ తీసుకోబోయే తదుపరి అడుగుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.







# నాగర్‌కర్నూల్ పార్లమెంట్ జనసేన ఆత్మీయ సమావేశం



**నాగర్ కర్నూల్ :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నాగర్‌కర్నూల్‌లోని రూబీ గార్డెన్స్ వేదికగా ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. శ్రీ మేడ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆత్మీయ సమావేశానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ తాళ్ళూరి రామ్ , తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ శ్రీ నేమూరి శంకర్ గౌడ్ , పార్టీ అధికార ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, జనసైనికులు, వీర మహిళలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాడటం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన దిశానిర్దేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ, ప్రజలకు అండగా నిలిచి, జనసేనను మరింత బలమైన ప్రజా శక్తిగా తీర్చిదిద్దేందుకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి జనసైనికుడు సమష్టిగా ముందుకు సాగాలని ఈ సమావేశం పిలుపునిచ్చింది.



## మోకాళ్ల నొప్పులు ఇంజెక్షన్లతో తగ్గుతాయనేది కేవలం అపోహ మాత్రమే




**-సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ సర్జన్ వినయ్ కుమార్.**

వనపర్తి, సమయం ప్రతినిధి : మోకాళ్ల నొప్పులు కేవలం ఇంజెక్షన్లతో పూర్తిగా తగ్గిపోతాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ఇలాంటి ప్రచారాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్ స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కీళ్ల మార్పిడి, రోబోటిక్ సర్జరీలపై శనివారం ఒక ప్రత్యేక వైద్యుల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో కీళ్లు మరియు మోకాళ్ల నొప్పులతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, వీరికి శాశ్వత పరిష్కారం చూపేందుకు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు.

**అందుబాటులోకి అత్యుత్తమ రోబోటిక్ సర్జరీ**

యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్‌లో మోకాలి, కీళ్ల మార్పిడి మరియు షోల్డర్ (భుజం) సమస్యల కోసం అత్యంత ఆధునికమైన పూర్తి స్థాయి రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్సలను అందుబాటులోకి తెచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ అడ్వాన్స్‌డ్ రోబోటిక్ ట్రీట్‌మెంట్ ద్వారా మోకాలి జాయింట్స్ ఎలాంటి వంకర లేకుండా, పూర్తిగా నార్మల్ స్థితికి వచ్చేలా నూటికి నూరు శాతం ఖచ్చితత్వంతో చికిత్స అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**తక్కువ కోత.. కేవలం రెండు రోజుల్లోనే నడక సాధ్యం అవుతుందని తెలిపారు.**

అనుభవజ్ఞులైన సర్జన్ల నైపుణ్యం, రోబోటిక్ సాంకేతికత తోడుకావడం వల్ల సర్జరీ సమయంలో ఎముక కోతలు (బోన్ కట్స్) చాలా తక్కువగా ఉంటాయని వైద్యులు వివరించారు. దీనివల్ల రక్తస్రావం, నొప్పి చాలా తక్కువగా ఉండి, సర్జరీ జరిగిన కేవలం రెండు రోజుల్లోనే పేషెంట్‌ను సొంతంగా నడిపించడం జరుగుతుందని అన్నారు. అలాగే, కీళ్ల మార్పిడిలో సాధారణంగా వాడే స్టీల్ ఇంప్లాంట్స్‌కు భిన్నంగా.. అత్యంత నాణ్యమైన, సుదీర్ఘ కాలం మన్నికగా ఉండే 'ఆక్సినియం ఇంప్లాంట్స్' మరియు మెటల్ సిరామిక్ అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్స్‌ను మాత్రమే వినియోగిస్తున్నట్లు తెలిపారు.

**క్రీడా గాయాలకు ప్రత్యేక చికిత్సలు**

ఆర్థోపెడిక్ సేవలతో పాటు హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్, షోల్డర్ రీప్లేస్‌మెంట్ వంటి అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని వైద్య బృందం తెలిపింది. ముఖ్యంగా క్రీడాకారులకు అయ్యే గాయాలకు (స్పోర్ట్స్ ఇంజూరీస్) వేగవంతమైన చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడా గాయాల బారిన పడిన వారు ఉదయం హాస్పిటల్‌కు వస్తే.. పరీక్షలు నిర్వహించి, అధునాతన పద్ధతిలో చికిత్స పూర్తి చేసి, సాయంత్రానికల్లా డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లేలా డే-కేర్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వైద్యులు ఈ సమావేశంలో వెల్లడించారు. మోకాళ్లు, కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడేవారు కాలయాపన చేసి సమస్యను జటిలం చేసుకోవద్దని, ఆధునిక రోబోటిక్ వైద్య విధానాలను ఉపయోగించుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి మార్కెటింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్స్ సతీష్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకటి శ్రీహరి ఆదేశాలతో భూత్పూర్ లెఫ్ట్ కెనాల్‌ను పరిశీలించిన టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్

(సమయం ప్రతినిధి అమరచింత) : భూత్పూర్ లెఫ్ట్ కెనాల్ పరిధిలోని ధర్మపూర్, మస్తీపూర్, అమరచింత, పిన్నంచర్ల గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్‌లో భారీగా జమ్ము, పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని రైతులు తెలంగాణ రాష్ట్ర టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కేశం నాగరాజు గౌడ్ స్వయంగా భూత్పూర్ లెఫ్ట్ కెనాల్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తో ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారులి. సంబంధిత అధికారులతో చర్చించి, కెనాల్‌లోని జమ్ము, పూడిక తొలగింపు పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం... సాగునీరు ప్రతి పొలానికి చేరే వరకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐజజ వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ , అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి , అమరచింత పట్టణ అధ్యక్షుడు టి రవి కాంత్ , అమరచింత మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ , అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి, నాగల్ కడుమూరు గ్రామ అధ్యక్షుడు జగన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## జడ్చర్లలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారుల కొరడా

**- అదనపు అంతస్తులు, మార్పులు - విస్తరణలకు ముందస్తు అనుమతి తప్పనిసరి**



జడ్చర్ల,ఆగస్టు 29, సమయం ప్రతినిధి : మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తూ అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ, అనధికార నిర్మాణాలపై జడ్చర్ల మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. ఇప్పటికే ఉన్న భవనాలకు అదనపు అంతస్తులు నిర్మించాలన్నా.. భవనాల్లో మార్పులు, విస్తరణలు చేపట్టాలన్నా ముందుగా మున్సిపాలిటీ నుంచి అనుమతి పొందాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం, భవన విస్తరణ పనులు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. పట్టణంలో అనధికార నిర్మాణాలను గుర్తించి నియంత్రించేందుకు ప్రత్యేక మున్సిపల్ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు.

**నోటీసులు.. పనుల నిలిపివేత :** అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత చట్టాలు, మున్సిపల్ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని అధికారులు తెలిపారు. అవసరమైతే నిర్మాణ పనులను నిలిపివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పత్రాలు సిద్ధంగా ఉంచాలి :** మున్సిపల్ అధికారులు, ప్రత్యేక బృందాలు తనిఖీలకు వచ్చినప్పుడు భవన యజమానులు బిల్డింగ్ పర్మిషన్, ఆమోదిత బిల్డింగ్ ప్లాన్, అనుమతి పత్రాలు, పన్ను, ఆస్తికి సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను అందుబాటులో ఉంచి అధికారులకు సహకరించాలని సూచించారు. తనిఖీల సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించకుండా ఉండటం, నిర్మాణానికి సంబంధించిన వాస్తవ వివరాలను దాచడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. నిర్మాణానికి చట్టబద్ధమైన అనుమతులు ఉంటే సంబంధిత పత్రాలను అధికారుల పరిశీలనకు అందించాలని సూచించారు.

**అనుమతి తీసుకున్నాకే నిర్మాణం :** ప్రజలు ఎలాంటి ఇబ్బందులు, చట్టపరమైన చర్యలకు గురికాకుండా నిర్మాణ పనులు ప్రారంభించే ముందే మున్సిపాలిటీ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని అధికారులు కోరారు.

## ఈ బస్సు క్లీనర్ నిజంగా దేవుడే.. వృద్ధుడిని ఎలా కాపాడాడో చూడండి..

సమయం ప్రతినిధి : ఆపదలో ఉన్న సమయంలో సడన్‌గా కొందరు ప్రత్యక్షమై.. ప్రమాదం నుంచి తప్పిస్తుంటారు. సమయానికి దేవుడిలా వచ్చాడు.. అని ఇలాంటి సమయాల్లోనే అనిపిస్తుంటుంది. ఇలాంటి సంఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంటాయి. తాజాగా, ఈ తరహా వీడియో ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. బస్సు నుంచి పడిపోతున్న వృద్ధుడిని క్లీనర్ ఎంతో చాకచక్యంగా రక్షించాడు. ఈ వీడియో చూసిన నెటిజన్లు.. క్లీనర్‌ను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. సోషల్ మీడియాలో ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ ఘటన కేరళంలో చోటు చేసుకుంది. కుట్టియట్టూరు-కన్నూర్ మార్గంలో నడుస్తున్న బస్సులో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. మార్గ మధ్యలో బస్సు ఆగగానే ఓ వృద్ధుడు పైకి ఎక్కాడు. అయితే వృద్ధుడు లోపలికి రాగానే బస్సు కదలడంతో ఆతను బ్యాలెన్స్ కోల్పోయాడు. ఈ క్రమంలో కిందపడిపోబోయాడు. అయితే అక్కడే ఉన్న బస్సు క్లీనర్ వెంటనే వెంటనే అప్రమత్తమయ్యాడు. కిందపడుతున్న వృద్ధుడిని వెంటనే పట్టుకుని పైకి లేపాడు. అంతలో అక్కడున్న మరో ప్రయాణికుడు కూడా అప్రమత్తమై.. వృద్ధుడి కాలు పట్టుకుని కిందపడకుండా ఆపాడు. ఆ సమయంలో క్లీనర్ క్షణం ఆలస్యం చేసినా.. ఆ వృద్ధుడు బస్సు నుంచి కిందపడిపోయేవాడు.




ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసిన 'షో స్టాపర్స్ – 2026' ప్రత్యేక సంచిక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మెరిసిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో తమదైన ముద్ర వేస్తూ ప్రభావం చూపుతున్న వంద మంది ప్రముఖులతో ఈ ప్రత్యేక సంచికను రూపొందించింది ఫోర్బ్స్ ఇండియా. పాన్ ఇండియా స్థాయిలో విశేషమైన క్రేజ్ సంపాదించుకున్న అల్లు అర్జున్‌కు ఈ జాబితాలో ప్రత్యేక స్థానం దక్కింది. 'పుష్ప', 'పుష్ప 2: ది రూల్' చిత్రాలతో దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేకమైన మార్కెట్‌ను ఏర్పరచుకున్న ఆయన.. బ్రాండ్ విలువ, ప్రజాదరణ, ప్రభావం వంటి అంశాల్లో తన సత్తాను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో 'షో స్టాపర్స్ – 2026' కవర్ స్టార్‌గా అల్లు అర్జున్‌ను ఎంపిక చేసింది ఫోర్బ్స్ ఇండియా. ఈ అరుదైన గుర్తింపుపై అల్లు అర్జున్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫోర్బ్స్ ఇండియా కవర్ ఫొటోషూట్ సందర్భంగా జరిగిన ఆసక్తికరమైన విషయాలను కూడా అల్లు అర్జున్ అభిమానులతో పంచుకున్నారు. తెరవెనుక జరిగిన ఫొటోషూట్ విశేషాలకు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు.కవర్ షూట్‌లో అల్లు అర్జున్ స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాన్ ఇండియా స్టార్‌గా అల్లు అర్జున్ సాధిస్తున్న వరుస ఘనతల్లో ఫోర్బ్స్ ఇండియా 'షో స్టాపర్స్ – 2026' కవర్‌పై చోటు దక్కించుకోవడం మరో మైలురాయిగా నిలిచింది.




నక్క తోక ఫిలిమ్స్ బ్యానర్ పై జైవర్ధన్ మేడి దర్శకత్వంలో యోగేంద్ర ప్రసాద్ పొట్లూరి, రాణి మాడిసన్ నిర్మాతలుగా రూపొందుతున్న చిత్రం "అంబా'స్ రివెంజ్". పూర్తిగా ఏఐలో తెరకెక్కించిన విజువల్ ఫీస్ట్ మూవీ ఇది. భారత దేశపు ఇతిహాసాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన మహాభారతంలో అంబ ప్రతీకారం నుండి లైన్ తీసుకుని ఈ కథ చేసాము. మహాభారతంలో భీష్ముని వల్ల ఒక జన్మలో మరణించిన ఆమె, మరో జన్మలో భీష్ముని పై పగ తీర్చుకున్న ప్రయాణాన్ని చూపించే దిశగా ఈ చిత్రం ఉంటుంది. మనుషులు ఎవరు నటించ కుండా కేవలం ఎఐ ద్వారా రూపొందించిన ఈ చిత్ర టీజర్ ఇటీవల విడుదల ఆవిష్కరించారు. నిర్మాత యోగేంద్ర ప్రసాద్ పొట్లూరి మాట్లాడుతూ 'ఎఐలో సినిమా చేయడం చాలా ఖర్చుతో కూడిన విషయం. సాధారణంగా ఇటువంటి సినిమా చేయాలంటే తక్కువ ఖర్చు అనుకుంటారు కానీ ఒక టూల్ ఉపయోగించే లోపు మరొక టూల్ వస్తుంది. అలా బాగా ఖర్చు పెరిగింది. ప్రస్తుతం అందరూ రీల్స్ లో ఎఐ చూస్తున్నారు. కానీ ఈ సినిమా చాలా అద్భుతంగా ఉండబోతుంది" అన్నారు. దర్శకుడు జైవర్ధన్ మేడి మాట్లాడుతూ "సినిమా అంబ అయినప్పటికీ శిఖండి నుండి చూడబోతున్నాము. సినిమాలో ప్రముఖ పాత్రలు ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసం టీజర్ విడుదల చేశాము. త్వరలో ట్రైలర్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నాము" అన్నారు. ప్రమోద్ ఎంసి సంగీతం అందించిన ఈ ఎఐ చిత్రానికి హ్యారీ బ్రెయిన్ ఎడిటింగ్ & డిఐ చేయగా కిషోర్ కుమార్ ఏనుగు డైలాగ్స్, లిరిక్స్ అందించారు.




నేచురల్ స్టార్ నాని , డైనమిక్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారీ పాన్-వరల్డ్ చిత్రం 'ది ప్యారడైజ్'. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, 'ఆయా షేర్' ఫస్ట్ సింగిల్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. తాజాగా ఈ మూవీ నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సెకండ్ సింగిల్ 'ఏషనాగుల' పాటను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ లైవ్ కాన్సర్ట్‌లో నాని సమక్షంలో ఈ పాటను ముందుగా ఆవిష్కరించగా, ఇప్పుడు డిజిటల్‌గా విడుదలైన ఈ ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సమకూర్చిన ఈ హై-వోల్టేజ్ ఫోక్ మాస్ ఆంథమ్ మొదటి బీట్ నుంచే ఆకట్టుకుంటోంది. కాసర్ల శ్యామ్ రాసిన పక్కా లోకల్ తెలంగాణ ఫోక్ లిరిక్స్ 'ఏష నాగుల కట్ట మీద ఏసిన ఉయ్యాలా.. మనం ఊగుదామే బాలా' పాటకు ప్రాణంగా నిలిచాయి. ప్రభా బంగారిగళ్ళ, అద్దుల జంగిరెడ్డి తమ పవర్‌ఫుల్ జానపద గాత్రంతో పాటను మరో లెవెల్‌కు తీసుకెళ్లారు. వీడియోలో నాని తన ఊరమాస్ రా లుక్‌లో కనిపిస్తూ ఎనర్జిటిక్ మూమెంట్స్‌తో దుమ్మురేపగా, కీర్తి సురేష్ చేసిన స్పెషల్ డ్యాన్స్ అండ్ గ్లామరస్ ఫోక్ స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆట సందీప్, జ్యోతి రాజ్ కంపోజ్ చేసిన కొరియోగ్రఫీ పాటలోని దాబా వైబ్‌ను ఓ రేంజ్‌లో ఎలివేట్ చేస్తోంది. బ్యాక్‌డ్రాప్‌లో వందలాది డ్యాన్సర్ల మధ్య సాగే విజువల్స్, సిహెచ్ సాయి సినిమాటోగ్రఫీ, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ ప్రతి ఫ్రేమ్‌లోనూ గ్రాండియర్‌ను స్పష్టంగా చూపించాయి. మొత్తం మీద 'ఏషనాగుల' సాంగ్ థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్, స్టెప్పులు వేయించేలా అదిరిపోయే మాస్ చార్ట్‌బస్టర్‌గా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేనే లేదు. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం సహా పలు అంతర్జాతీయ భాషల్లో గ్రాండ్‌గా విడుదలయ్యేందుకు ముస్తాబవుతోంది.




నిహాల్ కోదాటి కీలక పాత్రలో అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పై యాక్షన్ డ్రామా 'సీక్రెట్ సోల్జర్'. సూర్య శ్రీనివాస్, హర్షిత, శ్రీషా, కమల్ కామరాజు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ట్రైలర్‌ను చూస్తే దేశ రహస్యాలు, గూఢచర్యం, యాక్షన్ అంశాల చుట్టూ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. సాధారణ స్పై కథలకు భిన్నంగా సరికొత్త కథాంశంతో సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ ఆసక్తిని పెంచుతోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌కు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది.




బుల్లితెర ప్రేక్షకులకు 'మొగలిరేకులు' సీరియల్‌తో దగ్గరైన నటి శిరీష మరోసారి పెళ్లి పీటలెక్కింది. యాంకర్ కమ్ నటుడు మహేంద్రను వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించింది. కొంతకాలంగా వీరిద్దరి పెళ్లిపై సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే వాటిపై ఎలాంటి స్పష్టత ఇవ్వని ఈ జంట.. తాజాగా ఒక్కటై అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. తమ వివాహానికి సంబంధించిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. శిరీష.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆమె అచ్చతెలుగు అమ్మాయి. నటనపై ఆసక్తితో బుల్లితెరపైకి వచ్చిన శిరీషకు 'మొగలిరేకులు' మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఆ తర్వాత 'రాములమ్మ', 'స్వాతి చినుకులు', 'మనసు మమత', 'చెల్లెలి కాపురం', 'కలవారి కోడలు కనకమహాలక్ష్మి', 'త్రిశూలం' తదితర సీరియల్స్‌లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆమె ఇద్దరు అక్కాచెల్లెళ్లు కూడా సీరియల్స్‌లో నటించినప్పటికీ.. శిరీషకు మరింత క్రేజ్ వచ్చింది. ఇక శిరీష వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. గతంలో నవీన్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వీరికి ఓ కుమారుడు కూడా ఉన్నాడు. అయితే కొన్ని వ్యక్తిగత కారణాలతో 2024లో భర్త నుంచి విడిపోతున్నట్లు శిరీష ప్రకటించింది. తమ బంధాన్ని ముగించుకున్నామని, పరిస్థితుల కారణంగానే ఇద్దరం విడిపోయామని అప్పట్లో సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకుని గౌరవించాలని అభిమానులను కోరింది. కొంతకాలం తర్వాత శిరీష మరోసారి పెళ్లి చేసుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. . యాంకర్, నటుడు మహేంద్రతో ఆమె వివాహం జరిగింది. మహేంద్ర తొలుత ఆర్జేగా కెరీర్‌ను ప్రారంభించాడు. అనంతరం 'ఇంటింటి రామాయణం', 'మగువ ఓ మగువ' వంటి సీరియల్స్‌లో సహాయ పాత్రల్లో నటించాడు. ప్రస్తుతం నటుడిగా కొనసాగుతూనే సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూలతోనూ ప్రేక్షకులకు దగ్గరవుతున్నాడు. మహేంద్ర, శిరీషలకు ఎప్పుడు, ఎలా పరిచయం ఏర్పడిందన్న విషయం మాత్రం స్పష్టంగా తెలియదు. అయితే ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించి ఈ జంట శుక్రవారం సింపుల్‌గా వివాహం చేసుకున్నారు. తమ పెళ్లి విషయాన్ని స్వయంగా వెల్లడించడంతో అభిమానులు, సహనటులు, నెటిజన్లు కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. శిరీష కంటే మహేంద్ర వయసులో చిన్నవాడని సమాచారం.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085